క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



గుణదల(విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని సినీ తార మెహరీన్ పిలుపునిచ్చారు. స్థానిక వెటర్నరీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన జాయ్ ఎలక్ట్రిక్ షోరూంను ఆమె గురువారం ప్రారంభించారు. గరుడ సంస్థ ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మెహరీన్ చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగిందన్నారు. గరుడ సంస్థ ఫౌండర్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ-వాహనాల వినియోగం ద్వారా ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతోందన్నారు.

రేపటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈనెల 21, 22, 23 తేదీల్లో క్రెడాయ్ విజయవాడ చాప్టర్ 9వ ప్రాపర్టీ షో ఎ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్, ప్రచార పోస్టర్‌లను గురువారం గుణదలలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మనీష్ కుమార్ సింగ్ క్రెడాయ్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగానికి చెందిన అన్ని విభాగాలను క్రెడాయ్ ప్రాపర్టీ షో ద్వారా ఒకే వేదికపైకి తీసుకురావడం శుభపరిణామమన్నారు. ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు క్రెడాయ్ కృషి అభినందనీయమని కొనియాడారు. క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రమణరావు, విజయవాడ చాప్టర్ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, వరదా శ్రీధర్, ప్రాపర్టీషో కన్వీనర్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయవాడరూరల్: పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రశాంతినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భక్తులకు గురువారం ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్-2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అన్న ప్రసాద వితరణ జరిగింది. సుమారు వెయ్యి మంది భక్తులకు భోజనాలు వడ్డించారు. ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక, హేమంతరావు పాల్గొన్నారు.

భారతీయ ఆధ్యాత్మిక ప్రాభవాన్ని కాపాడుకోవాలి



విజయవాడ కల్చరల్: భారతీయ ఆధ్యాత్మిక ప్రాభవాన్ని కాపాడుకోవాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా బీఆర్‌టీఎస్ రోడ్డులోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో గురువారం అమ్మవారి వేషధారణ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, తక్షశిల అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. న్యాయనిర్ణేతులుగా నవీన్, భారతి వ్యవహరించారు. మొదటి బహుమతిని నాగమణి, రెండో బహుమతిని క్రాంతి, మూడో బహుమతిని దేవిక గెలుచుకున్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు ఆధ్వర్యంలో సత్యవర్ధన్, రసూల్‌బాబు, వాసిరెడ్డి శ్రీనివాస్, వెంకటేష్, సుధారాణి, విష్ణుప్రియ రూపాశ్రీ పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. రంగస్థల, సినీ నటుడు కొప్పుల ఆనంద్ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, చిత్రంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ అన్నారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం సాయంత్రం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి?' అనే కార్యక్రమంపై వర్క్ షాప్ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి నిర్వహించబోయే 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి?' కార్యక్రమంపై నేతలు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 52 నెలల పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని.. సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని సంతోషంగా చెబుతున్నారన్నారు. విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రతి ఒక్కరితో ముఖాముఖి మాట్లాడి.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి చేరువయ్యామని.. ఇదే స్ఫూర్తితో బస్సు యాత్ర, 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాలను విజయవంతం చేసే బాధ్యత కార్యకర్తల భుజస్కంధాలపై ఉందన్నారు. రానున్న 5 నెలలు అత్యంత కీలకమని.. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదల తరఫున నిలబడిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు.

వ్యత్యాసాన్ని వివరించండి..

ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. సెంట్రల్ నియోజకవర్గంలోని 96 సచివాలయాల పరిధిలో 1,400 క్లస్టర్లు ఉండగా.. 3 వేల మంది గృహ సారథులు, 300 మంది కన్వీనర్లు ఉన్నట్లు తెలిపారు. వీరంతా గత ప్రభుత్వానికి, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి గడపకు వెళ్లి ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసిన విధానం వివరించాలన్నారు. జగనన్న సంక్షేమ పాలనపై ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. పేదలకు మంచి జరగాలన్నా.. ప్రజల భవిష్యత్తు బాగుండాలన్నా.. జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన పథకాలను పార్టీలు, వర్గాలు, మతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ రాష్ట్రానికి తప్పక అవసరమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

పరాశక్తి లలిత.. శివానంద చరిత



దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



దుర్గాపురంలో అమ్మవారు



అంకమ్మతల్లి శక్తిపీఠంలో మహాలక్ష్మీదేవిగా..



రామకోటిలో దివ్యమంగళ స్వరూపంలో సంతాన లక్ష్మి



న్యూఆర్ఆర్‌పేటలో శాకంబరిగా..



ఆంధ్రప్రభకాలనీలో లలితా త్రిపురసుందరీదేవీగా..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేట నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో ఐదో రోజు శాకంబరీదేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగణపతి యూనివర్సల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అమ్మవారిని అన్ని రకాల కూరగాయలతో అలంకరించారు. అనంతరం భవానీలు శాఖంబరీ అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు.

- సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని షిర్డీసాయి మందిరంలో వేంచేసి ఉన్న కాశీ అన్నపూర్ణమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి మహన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, సహస్ర నామార్చన, సాయంత్రం లలితా సహస్ర పారాయణలు జరిపారు.

మహాచండీదేవికి విశేష పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు గురువారం అమ్మవారు మహాచండీ దేవిగా భక్తుల పూజలు అందుకున్నారు.

- అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీగా అలంకారం చేసి పూజలు చేశారు.
- బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యాన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ట్రస్ట్ సభ్యురాలు బచ్చుమాధవీకృష్ణ ఆధ్వర్యాన అమ్మవారిని లలిత త్రిపురసుందరీ దేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు.
- దుర్గాపురంలో అమ్మవారిని మహా చండీదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.
- మధురానగర్ నేతాజీకాలనీలోని అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ముత్యాలంపాడులోని పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో బుధవారం అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.
- రామకృష్ణాపురం దుర్గాదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని మహా చండీదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు.
- రామలింగేశ్వరపేట ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయం వద్ద అమ్మవారిని మహాచండీదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- గద్దె వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.
- దావు బుచ్చయ్యకాలనీలోశ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు.

మంగళ గౌరీ పాహిమాం

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా గురువారం నగరంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో పార్వతీ దేవిని మంగళగౌరిగా కొలువుదీరారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిత్యహోమం, బలిహరణ, నవకుంభారాధన నిర్వహించారు.

సీఎం జగన్ పాలనలో సుభిక్షంగా రాష్ట్రం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడ తూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్‌లోని ఒకటో వార్డు సచివాలయ పరిధిలోని స్థానిక కార్పొరేటర్ ఉద్దండి సునీతతో కలిగి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మల్లాది విష్ణు గురువారం నిర్వహించారు. గాంధీజీ కాలనీలో విస్తృతంగా పర్యటించి 225 గృహాలను వారు సందర్శించారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా.. అని ఆరా తీశారు. సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసే బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజలు వివరించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ నవరత్నాలు పథకాలు ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.

కష్టజీవులకు 'చేదోడు'..

కష్ట జీవులకు తోడుగా ఉండేందుకు జగనన్న చేదోడు పథకానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నాల్గో విడత చేదోడు ద్వారా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 1,905 మంది బ్యాంకు ఖాతాల్లో రూ. 1,905 కోట్లు నిధులు జమ అయ్యాయన్నారు. వీరిలో 443 రజక, 167 నాయి బ్రాహ్మణ, 1,295 మంది టైలర్లు ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీడీవో జగదీశ్వరీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, అల్ల ప్రసాద్‌రెడ్డి, ఉద్దండి సురేష్, బండి వేణు, యలమంద, ఆర్టీసీ శ్రీను, చంద్రశేఖర్, తుంగం జాన్సీ, రమణి, ఫాతిమా పాల్గొన్నారు.

బాబాకు గులాబీలతో నామార్చన



గులాబీలతో సాయినాథుడు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో 105వ పుణ్యతిథి మహోత్సవాలు గురువారం ఐదోరోజుకు చేరుకున్నాయి. బాబావారికి విశేషంగా లఘున్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచసూక్త పఠనం చేశారు. క్షీరం, పంచదారతో బాబాకు అభిషేకం చేసి గులాబీలతో లక్షనామార్చన నిర్వహించారు. లోక కల్యాణార్థం మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి దంపతులు సాయినాథ, దత్తాత్రేయ హోమం వేదపండితుల మంత్రోచ్చరణలతో మధ్య నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

దత్తసాయిమందిరంలో..

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. మందిరం వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు పూజలు చేసి పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

ప్రజారోగ్యమే ప్రధాన అజెండా



సురక్ష కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ షాహీనా

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్‌లోని గుజ్జల సరళా దేవి కల్యాణ మండపం నందు గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ క్యాంపులను ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగపరచుకుంటున్నారని అన్నారు. హెల్త్ క్యాంపుల వద్ద ఎక్కడా ప్రజలకు ఇబ్బందులకు కలగకుండా.. అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తుండటంతో క్యాంపుల సంఖ్యను సైతం పెంచినట్లు తెలిపారు. కార్పొరేట్ తరహాలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పిల్లల వైద్యులు, ఈఎన్టీ, ఆర్థోపెడిక్ నిపుణులు వైద్య పరీక్షలు చేస్తుండటంతో వైద్య శిబిరాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారన్నారు. కంటికి సంబంధించిన సమస్యలు ఉన్నవారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 59వ డివిజన్లోని 243 వార్డు సచివాలయ పరిధిలో 1,450 కుటుంబాలకు గాను 4,500 మందిని వైద్య సిబ్బంది ఇంటింటీ సర్వే ద్వారా కలిసి 1,027 రకాల పరీక్షలు నిర్వహించారన్నారు. వీరందరికీ 5 దశల్లో ఉచితంగా ఆరోగ్య సేవలు అందించడంతో పాటు వ్యాధి నయం అయ్యేంత వరకు సరిపడా మందులు పూర్తి ఉచితంగా అందిస్తున్నామన్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని.. అత్యవసర సమయాలలో ఇబ్బందులకు గురికాకుండా ఆరోగ్య మిత్రల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుదారుల సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని.. ఈ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. అనంతరం రోగులకు మందులతో కూడిన మెడికల్ కిట్లను, పలువురికి కళ్లజోళ్లను అందజేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్ రెడ్డి, గోనెల కృష్ణ, కంభగళ్ల రాజు, ఎండి ఆసిఫ్, షేక్ జిలాని, డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు



విజయవాడ కల్చరల్: కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో దసరా మహోత్సవాల సందర్భంగా సత్యనారాయణపురం సీతారామా కల్యాణ మండపంలో గురువారం కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. నృత్య కళాకారిణి మానసతేజ బృందం కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య కీర్తనలకు నృత్యాలను అభినయించారు. నటరాజ కూచిపూడి నృత్యకళామండలి నిర్వాహకురాలు సాయిలక్ష్మి బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించింది. కార్యక్రమాలను దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ సభ్యుడు కందుకూరి సుబ్రహ్మణ్యం, ఇతర సభ్యులు కళాకారులకు ప్రశంసా పత్రాలను అందించారు.







జగజ్జననికి జేజేలు

నమో చండీ అంటూ భక్తులు కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. దసరా ఉత్సవాల్లో గురువారం మహాచండి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మ సన్నిధిలో ప్రత్యేక కుంకుమార్చనలు, చండీ హోమం జరిగాయి. ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో పలుచోట్ల ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు అనేక మంది భక్తులకు సేవలు అందిస్తున్నాయి. ఉత్సవాల్లో దుర్గమ్మ అన్నప్రసాదానికి భక్తులు బారులు తీరి కనిపించారు. అమ్మవారిని కనులారా దర్శించుకున్న భక్తజనం ఉప్పొంగిన భక్తిభావంతో వెనుతిరిగారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ





